క్లుప్తంగా

అదనపు లోడ్ క్రమబద్ధీకరణ

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో ట్రాన్స్‌కో డీపీఈ డిస్కం ఎస్ఈ శ్రీనివాస్‌బాబు తనిఖీలు చేశారు. ఈ మేరకు కొంగారెడ్డిపల్లెలోని రెండు వాణిజ్య సర్వీసులు అదనపు లోడ్‌లను వాడుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు వారికి రూ.15వేలు జరిమానా విధించారు. నిర్ధిత రుసుము చెల్లించి లోడ్‌ను పెంచుకోవాలని ఆదేశించారు.

గొల్లపల్లి పాఠశాల తనిఖీ

యాదమరి(కాణిపాకం): యాదమరి మండలంలోని కె గొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంద రోజుల ప్రణాళిక నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉపాధ్యాయులు, బడికి మంచి పేరు తీసుకురావాలని ఆమె చెప్పుకొచ్చారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ గ్రీవెన్స్‌లో 4 సమస్యలు



వినియోగదారులతో మాట్లాడుతున్న డీఈ ప్రసాద్, ఆనంద్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వినియోగదారులు సమస్యలను తెలిపారు. మొత్తం 4 ఫిర్యాదులు వచ్చాయని డీఈలు ప్రసాద్, ఆనంద్ పేర్కొన్నారు. మీటర్ బాగు చేయాలని, మీటరు పేరు మార్చాలని, బిల్లు సవరణ, డిస్‌కనెక్ట్ అయిన సర్వీసును రీకనెక్ట్ చేయాలని వినియోగదారులు ఫిర్యాదులు చేశారన్నారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించినట్లు వివరించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఈ మాధురి, జేఏఓ గోవిందరాజులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు తగ్గించుకోండి



మాట్లాడుతున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: రైతులు సాగు చేసే పంటలకు రసాయన ఎరువుల వాడకం తగ్గించుకుని సేంద్రియ ఎరువులు వాడాలని ఏఓ వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఆర్బీకేలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని, అందుకనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించాలన్నారు. భూసార పరీక్షలు, విత్తనాల ఎంపిక, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంలో వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. వ్యవసాయ రంగానికి అవసరమైన పరికరాలను ప్రభుత్వం రాయితీతో రైతులకు అందజేయాలని, ఉపాధి హామీ పథకం వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలని పలువురు రైతులు ఏఓకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీహెచ్ఏ కావేరి, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను వినియోగించుకోండి



ఆధార్ స్పెషల్ డ్రైవ్‌లో అధికారులు

గుడిపాల: గ్రామ సచివాలయాల్లో ప్రత్యేకంగా అందిస్తున్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శివరాజన్ కోరారు. మండలంలోని వసంతాపురం గ్రామ సచివాలయంలో అందిస్తున్న ఆధార్ సేవలను ఆయన బుధవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆరేళ్లలోపు శిశువులకు తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయించాలని, ఇంకా ఎవరు ఆధార్ కార్డులో తప్పులు ఉన్నా మార్పులు చేయాలన్నా ఆధార్ కేంద్రాలను ఆశ్రయించి, చేయించుకోవాలన్నారు. ఆధార్ నమోదు చేసుకుంటే ప్రభుత్వ పథకాలు వర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

వీర సైనికుడికి నివాళి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని ఎగువరాగిమానుపెంటలో బుధవారం వీరజవాన్ కార్తీక్‌కు ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. విద్యార్థులు ర్యాలీగా వచ్చి కార్తీక్ భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు తదితరులు నివాళులర్పించారు.

మామిడి చెట్లకు మందు పిచికారీ చేస్తున్న కూలీలు





మామిడికి మంచు ముప్పు

- పంటకు పూత దశే కీలకం
- మెలకువలు పాటిస్తేనే దిగుబడి
- తేనెమంచు, బూడిద తెగులు దాడి
- ఉద్యానవన శాఖాధికారి సూచన

ఐరాల: మామిడిలో పిందెలు త్వరగా రావడానికి పూత పిందె దశలో చీడ పీడల నుంచి కాపాడుకోవడానికి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడానికి ఇదే సరైన సమయం. ఉద్యానవన పంటల్లో మామిడిది ప్రత్యేక స్థానం. వివిధ రకాల వంగడాలు ఇక్కడ సాగు చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 38 వేల హెక్టార్లలో మామిడి తోటలు విస్తరించాయి. ఏటా 3 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి లభిస్తోంది. నాణ్యమైన పంట దిగుబడులు మార్కెట్లో మంచి ధర లభిస్తోంది. శీతాకాలంలో మామిడి చెట్టు పూత దశకు వస్తాయి. కీలకమైన పూత దశలో వాతావరణ పరిస్థితులు, ఉష్ణోగ్రతలు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. కొన్ని సమయాల్లో పూత వచ్చినప్పటికీ అది ముడుచుకుపోయే ప్రమాదం ఉంది. సీజనల్ పూత పూర్తిగా రాకపోవడం కారణంగా నష్టం వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. ఈ సమయంలో రైతులు తగిన మెలకువలు పాటిస్తే అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుంది. మండల ఉద్యానవన శాఖాధికారి సాగరిక మామిడికి ఆశించే పురుగు, వైరస్ వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు తెలియజేశారు.

సాగునీటి యాజమాన్యం

మామిడి పూత సమయంలో తోటలకు నీటితడులు చాలా అవసరం. పూత, మొగ్గ బయటకు పడే సమయంలో మామిడి తోటలకు తప్పనిసరిగా నీరు అందిచాల్సి ఉంటుంది. నీటిని అందించే సమయంలో కూడా జాగ్రత్తలు పాటించాలి. పది పదిహేను ఏళ్లలోపు తోటలకు ఒకసారి, బాగా తేలిక పాటి నేలలైతే వారం తర్వాత ఒకసారి తడులు అందివ్వాలి. లేదంటే డ్రిప్పుల ద్వారా వారం రోజుల పాటు నీరు అందిస్తే మంచి ప్రయోజనం చేకూరుతుంది.

మామిడి పిందె దశలో..

ఆలస్యంగా కోతకు వచ్చే రకాల చెట్లపై హార్మోన్లను పిచికారీ చేస్తే పూత, పిందె రాలడం బాగా తగ్గుతుంది. తెల్లపూత జొన్న గింజ పరిమాణంలో పిందెలు ఉన్నప్పుడు 200 లీటర్ల నీటిలో 4 గ్రాముల నాఫ్తలీన్ అసిటిక్ ఆమ్లం, 400 గ్రాముల బోరాన్ కలిపి పూతపై పడేలా పిచికారీ చేసుకోవాలి. దీంతో పిందె కట్టే సమయంలో పిందె రాలడాన్ని నివారించవచ్చు. కాయ దశ వరకు దీని ప్రభావం ఉంటుంది. పిందె పరిమాణం పెరుగుతున్న సమయంలో మామిడి చెట్ల మొదళ్లలో తడి ఆరకుండా చూసుకోవాలి.

తేనెమంచు పురుగు

చలికాలంలో ఎక్కువగా మామిడికి సోకే తెగులు తేనెమంచు పురుగు. పూత రాగానే తేనెమంచు పురుగు కాండం వద్ద రసం పీలుస్తుంది. దీంతో పోషకాలు అందక పూత రాలిపోతుంది. తోటలోని మొక్కలను బాగా గమనిస్తే పూత వచ్చిన కాడ కింద ఆకులు జిగటగా ఉంటూ ఉదయం పూట మెరుస్తూ ఉంటుంది. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 17.8 శాతం ఎస్ఎల్ గానీ, సైహాలో థ్రీన్ 5 ఈసీ గానీ 5 మిల్లీ లీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి కొనసాగితే 20 రోజుల తరువాత థయోమిథాక్సిమ్ 25 డబ్ల్యూజీ 0.3 గ్రాములు లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి. అప్పటికీ ఉధృతి కొనసాగుతుంటే బుప్రోఫెజిన్ 25 ఎస్‌సీ 1.2 మిల్లీలీటరు ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు

పూత కాడల మీద బూడిద మాదిరిగా కనిపిస్తుంది. బూడిద తెగులు గాలి ద్వారా చాలా వేగంగా ఓ మొక్క నుంచి మరో మొక్కకు వ్యాపిస్తుంది. దీని వల్ల చాలా వరకు పూత నిలవకపోవడంతో నష్టం చేకూరుతుంది. తెగులును గుర్తించిన వెంటనే మందులు పిచికారీ చేసి నివారణ చర్యలు తీసుకోవాలి. బూడిద తెగులు నివారణకు సల్ఫర్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా ఎక్సాకొనెజోల్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే ఈ తెగులును నివారించవచ్చు.

వినాయకపురం వద్ద పూత రాలిపోయిన మామిడితోట



సకాలంలో పిచికారీ చేసుకోవాలి

మామిడి చెట్లకు సకాలంలో మందులు పిచికారీ చేయాలి. 15 ఏళ్లు పైబడిన చెట్లకు పిందె పరిమాణంలో ఉన్న సమయంలో 500 గ్రాముల యూరియా, కిలో పొటాషియం వేయాలి. అలా వేయడం వల్ల పిందె అభివృద్ధి చెంది వాతావరణ మార్పులను తట్టుకుంటుంది. పిందె పరిమాణం పెరిగిన అనంతరం లీటరు నీటికి 100 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి 20 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి



మామిడిలో మంచి దిగుబడి సాధించాలంటే సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పూత త్వరగా రావడానికి సరైన జాగ్రత్తలు పాటించాలి. 13.0.45 (మల్టీకె) 10 గ్రాములు, బోరాన్ 1.25 గ్రాములు గానీ ఆర్కమ్యాంగో స్పెషల్ 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. రైతులకు ముందుస్తుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– సాగరిక, ఉద్యానశాఖాధికారి, ఐరాల

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి







గుడిపాల: వసంతాపురంలో వైద్య సేవలందిస్తున్న జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్, చింతగుంటూరులో పశువులకు డీవార్మింగ్ చేస్తున్న డాక్టర్ రవితేజ, తవణంపల్లె: మందు పిచికారీ చేస్తున్న డాక్టర్ లావణ్య

గుడిపాల: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్ అన్నారు. వసంతాపురం, చింతగుంటూరులో బుధవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. వసంతాపురంలో జరిగిన పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. జేడీ మాట్లాడుతూ పశువులకు సోకే వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పశువులు, మేకలు, గొర్రెలకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. పశుపోషణ, ఆరోగ్య సమస్యలపై గ్రామాల్లో అందుబాటులో ఉంటున్న సచివాలయ పశుసహాయకులను వెంటనే సంప్రదించాలన్నారు. పశువులకు గర్భకోశ చికిత్సలు, ఆవులకు కృత్రిమ గర్భధారణ, డీ వార్మింగ్ మందులను తాపించి పిడుదుల నివారణకు స్ప్రే చేయించారు. మండలంలో 312 పశువులకు వైద్యశిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్, డాక్టర్లు సాయిసుధ, రవితేజ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశు సంరక్షణే ధ్యేయం

ఐరాల: పశు సంరక్షణే ధ్యేయంగా ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మండల పశుసంవర్ధకశాఖ ఏడీ పద్మావతి అన్నారు. బుధవారం మండలంలోని మల్లారపల్లె, చిన్నసామిరెడ్డిపల్లె, నెల్లిమందపల్లె గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్య సహాయకులు పశువులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 98 దూడలకు నట్ట నివారణ మందులు, 152 పెద్ద పశువులకు బద్దెపురుగు, ఏలిక పాముల నివారణ మందులు పంపిణీ, 150 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. అనంతరం శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, పశు విజ్ఞానంపై పాడి పోషకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మద్దిపట్టపల్లె పశు వైద్యాధికారి పినకపాణి, రైతులు పాల్గొన్నారు.



ఐరాల: పాడి ఆవుకు పిడుదల మందు పిచికారీ చేస్తున్న పశు వైద్య సహాయకుడు

శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

తవణంపల్లె: పశు ఆరోగ్య వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య తెలిపారు. మండలంలోని పుణ్యసముద్రం, జొన్నగురకల, జి.గొల్లపల్లె, సరకల్లులో బుధవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. అందులో పాల్గొన్న డాక్టర్ లావణ్య మాట్లాడుతూ, పాడి పశువుల్లో గర్భకోశ వ్యాధికి చికిత్సలు అందించారు. 700 పశువులకు పిడుదుల నివారణ మందు లు పిచికారీ చేయించారు. దూడలకు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల తాగించారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

ఐరాల: మండలంలోని ఎర్రేపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత విజయసింహారెడ్డి(67) బుధవారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.



నివాళులర్పిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

గర్భిణులకు మెరుగైన వైద్యం

గుడిపాల: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా గర్భిణులకు ఇంటి వద్దకే మెరుగైన వైద్యం అందుతోందని బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష తెలిపారు. మండలంలోని 197రామాపురంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెరవ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో 55 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది దివ్య, సరస్వతి, శశి, అశ్విని, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ అనూష

ప్రభుత్వ ఆస్పత్రికి కుర్చీల వితరణ

బంగారుపాళెం: మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రికి బుధవారం కాగ్ల్ కంపెనీ, క్రెడిట్ యాక్సిస్ ఇండియా ఫౌండేషన్ వారు ఉచితంగా కుర్చీలు వితరణ చేశారు. త్రీ సీటర్ స్టీల్ కుర్చీలు 5, 20 ప్లాస్టిక్ కుర్చీలను ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీషకు అందజేశారు. కుర్చీలు అందజేసిన కంపెనీ ప్రతినిధులకు ఆమె కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసబాబు, రమేష్ బాబు, జగదీష్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఆస్పత్రికి కుర్చీలు అందజేస్తున్న దాతలు

స్పీడ్ బ్రేకర్లు.. ప్రమాద కారకాలు





నరహరిపేట సమీపంలో వేసిన స్పీడ్ బ్రేకర్, నంగమంగళంలో అనధికారికంగా వేసిన స్పీడ్ బ్రేకర్

గుడిపాల: వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు ఏర్పాటుచేసిన స్పీడ్‌బ్రేకర్లు (వేగనిరోధకాలు) ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. వాహనాలపై వెళ్లే వారు స్పీడ్ బ్రేకర్స్ కనిపించకపోవడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలో కొంతమంది అనుమతులు తీసుకోకుండా ఇళ్ల ముందు ఇష్టారాజ్యంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. రాత్రి సమయాల్లో వాహనాలపై వచ్చే వారికి ఎత్తుగా ఉండే స్పీడ్ బ్రేకర్లు దగ్గరకి వచ్చే వరకు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎత్తుగా వేసిన వేగ నిరోధకాల(స్పీడ్ బ్రేకర్లు)వద్ద హఠాత్తుగా బ్రేక్‌లు వేయాల్సి రావడంతో వాహనాలు పాడవుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు.

రంగులు, స్టిక్కర్లు ఏవీ?

స్పీడ్ బ్రేకర్లు ఉన్నచోట తెలుపు, నలుపు రంగులతోపాటు రేడియం స్టిక్కర్లు వేయలేదు. దీంతో దగ్గరికి వచ్చే వరకు అవి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అటు అధికారులు, ఇటి నాయకులు కానీ వాటిని పట్టించుకోక పోవడంతో వాహనదారులు గాయాలపాలవుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన వేగ నిరోధకాలను(స్పీడ్‌బ్రేకర్లు) తొలగించాల్సి ఉంది.

ఎక్కడెక్కడ వేయాలంటే...

స్పీడ్ బ్రేకర్లు వాస్తవానికి స్కూల్‌జోన్ ప్రాంతాలు, రెండు లేదా నాలుగు లైన్ల రోడ్డు జంక్షన్ పాయింట్ల వద్ద, దేవాలయాలు, పాదచారులు రోడ్డుదాటేందుకు నిర్దేశించిన ప్రాంతాలకు సమీపంలో వాహనాలు వేగంగా రాకుండా నియంత్రించేందుకు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటుచేస్తారు. అది కూడా పోలీసులు, పంచాయతీ అధికారుల సమన్వయంతో ఏయే ప్రాంతాల్లో ఏ పరిమాణంలో నిర్మించాలో నిర్ణయిస్తారు. వాటిపై తెలుపు, నలుపు రంగులు వేయడంతో పాటు రేడియం స్టిక్కర్లు కూడా అతికిస్తారు. అందువల్ల అవి ప్రమాదాల నియంత్రణకు దోహదపడతాయి.

అధికారులు స్పందించాలి



గుడిపాలలోని వీధుల్లో స్పీడ్‌బ్రేర్లు ఏర్పాటు చేయడం వల్ల రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా ఉంది. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై వస్తున్నప్పుడు స్పీడ్ బ్రేకర్లు గుర్తించలేక అదుపుతప్పి కిందపడిపోయి గాయాల పాలవుతున్నాం. అనధికారికంగా స్పీడ్‌బ్రేకర్స్ వేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. అలాగే స్పీడ్ బ్రేకర్లను తొలగించాలి.

– నాగరాజ్, గుడిపాల

గాయాలపాలవుతున్నాం



ప్రతి గ్రామంలో స్పీడ్ బ్రేకర్లు అనధికారికంగా వెలిశాయి. గుడిపాల, నరహరిపేట, నంగమంగళం, బొమ్మసముద్రం క్రాస్ వద్ద ఎక్కువగా ఉన్నాయి. నేను కూడా స్పీడ్ బ్రేకర్స్ వల్ల అదుపుతప్పి కింద పడిపోయాను. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రేణుకుమార్, నరహరిపేట